# తుఫాన్!

'వల్లరి'

క్రిటికీలోంచి వెన్నెలపడుతోంది. ఆ వెన్నెల కిరణాల్ని లెక్కపెట్టూనే కన్నులు మూసాడు కమలనాథుడు. ప్రియసతి సుశీవచ్చి కాలిబొటనవ్రేలు నెమ్మదిగా కదిలించింది. అతడు "వో...సుశీ..." అని, లేచికూర్చున్నాడు. వెండిగ్లాసులోవున్న పాలు చేతికందించి ప్రక్కన కూర్చుంది లక్ష్మీదేవిలా. కమలనాథుడు సగంపాలు త్రాగి మిగిలినవి సుశీ నోటి కందించాడు. పాలుత్రావి పాలపెదవులతో మంతనాలాడుకొన్నారు. బాహులతలతో వొరిగి వుల్లాసముతో వూగులాడిపోయారు.

అలా వారి జీవితము వెన్నెల పండుగలా యెన్నాళ్లు గడిచిందో! ఎవరికెఱుక?

తుఫానుతోపాటు వారి జీవిత సీమపైనను తుఫాను చెలరేగింది. ఝంఝానిలపాతముతో, యేనుగతొండపు ధారతో వర్షాగమనంతో దేశంలో ప్రాణికోటికే నష్టం యేర్పడింది. ఇకపాడిపంటలకు, చెట్లుచేమలకు, మేడమిద్దెలకు కఱవా!

కాని, కమలనాథుని గృహారామంలో ప్రత్యేకంగా తుఫాను వీచేందుకు కారణమేమయ్యివుంటుందో!!

బ్రాకెట్ ఆటలో పెద్దలాభం రావడమే అయివుంటుంది. నిశ్చయంగా, దానితో కమలనాథుడు పగ్గాలు వదలిన గుఱ్ఱంలా చెలరేగిపోయాడు. ఆతని జీవితంలో— అతనిలోనే— క్రొంగొత్త వాతావరణం ప్రవేశించింది. అతనిదృష్టి క్రొత్తమార్గంలో పడ్డది. కాలమంతా అతురత నిత్యసౌఖ్యా అధోగతికి ఆలవాలమైన సాని ఆలయంలోనే జరిగిపోతోంది.

దేశం తుఫానుదెబ్బ తిన్నట్టు తెలీదు కమలనాథుకు. దురదృష్టవశాత్తు వార్తాపత్రికలో వొకమూల కనబడ్డది "తుఫాను బాధితులకు మీచేతనైనంత సహాయంచేసి మీబాధ్యత నెరవేర్చండి" అని.

"ఎక్కడ తుఫాను— ఎందుకు తుఫాను— ఎవరికితుఫాను" అని ఆతని నోటివెంట అప్రయత్నంగా వెలువడ్డాయ్.

ప్రియసతి సుశీ, కమలనాథునికోఱకు రోజూ ఎదురుజూస్తూనే వుంది. ఆమె వాడిపోయిన మోముతో, వడలిపోయిన మనస్సు ఎల్లవేళలా పరధ్యాన్నంలో వుంటోంది. నిత్యకర్మలు తుఫానుగాలిలో కొట్టుకుపోయినట్టున్నాయ్. పూజామందిరం సంస్కారవిహీనమై వెలవెలపోతోంది. ఆమె పరివర్తన, ప్రవర్తన అందరకూ ఆశ్చర్యం కల్గించకపోలేదు. ఆమె యేమీ చేయలేదు. ఎవరుమాత్రం యేమిచేయగలరు?

పడిపోయిన గృహాసులు, విరిగిపోయిన నాగళ్లు, చిక్కిపోయిన పశువులు, పూడిపోయిన జలకూపములు, శిథిలములైన దేవాలయపు గోపురములు— అన్నియు నిరత్యావస్థయందే వున్నాయ్.

అటు—

కమలనాథుడు దివ్యకాంతులనీనెడు నీలి దీపములక్రింద, మెత్తని సోఫాలలో— కళావంతములగు సుందర విగ్రహముల నడుమ— చిత్ర విచిత్రములుగ నమర్చబడిన గృహాంగణములలో మైమఱచిపోయి నిస్పృహలో విలీనమైపోయాడు.

తుఫాన్ పోటుతిన్న బీదజనులు కమలనాథుని కలుసుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ వమ్మైపోయాయ్........

ప్రియసతి సుశీ అలా యెదురుచూస్తూనేవుంది. ఆమెగృహం చెల్లాచెదరగానే వుంది. తిరుగబడిన పెంకులు అలానే వున్నాయ్. పడిపోయిన దడులు పడినట్టే వున్నాయ్........కాని, ఆమె ఒక్కపనిమాత్రం చేయగల్గింది— తనకు మిగిలివున్న మూడుజతల చీరలలో రెండుజతలు యిచ్చివేయగల్గింది. అంతే.

పాపం— ఆమెగృహం ఎప్పుడు చక్కబడుతుందో— మళ్ళీ తుఫాను ఎప్పుడు చెలరేగుతుందో!!!